సాక్షి
ఆదిలాబాద్
గురువారం : 11 : జనవరి : 2024



దీక్ష భూమికి.. కొత్తశోభ

నార్నూర్ మండలం కొత్తపల్లి-హెచ్ గ్రామంలోని జాతీయ బంజారాల దీక్ష భూమి ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. నేడు గురు కృప దినోత్సవం సందర్భంగా కథనం. 8లో▸



సీఎం ఓఎస్డీకి శుభాకాంక్షలు

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ నాల్గో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.గంగాధర్ ఆధ్వర్యంలో సీఎం ఓఎస్డీ గోపిడి చంద్రశేఖర్‌రెడ్డిని బుధవారం కలిశారు. సెక్రెటేరియట్‌లోని చాంబర్‌లో కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

గరిష్టం/కనిష్టం
30.0/18.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. వేకువ జామున పొగమంచు ప్రభావం కనిపిస్తుంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

నేడు అధికారికంగా ఓబన్న జయంతి వేడుకలు

కైలాస్‌నగర్: ప్రభుత్వ ఆదేశానుసారం వడ్డే ఓబన్న జయంతి వేడుకలను ఈ నెల 11న కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారికంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించే వేడుకలకు వడ్డెర కులస్తులు, బీసీ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

రేపటి లోగా టీసీసీ పరీక్ష ఫీజు చెల్లించాలి

ఆదిలాబాద్‌టౌన్: డ్రాయింగ్, ఎంబ్రాయిడరీ, టైలరింగ్ హయ్యర్, లోయర్ టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ) పరీక్ష ఫీజు అపరాధ రుసుము రూ.75తో ఈనెల 12లోగా చెల్లించవచ్చని డీఈవో ప్రణీత ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్ష ఫిబ్రవరిలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇదివరకు రూ.50 అపరాద రుసుముతో ఈనెల 5వరకు గడువు ఉండగా, అపరాద రుసుము పెంచి గడువు పొడిగించినట్లు తెలిపారు. ఫీజు చెల్లించని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

13న సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు

నేరడిగొండ: ఈనెల 13న కుంటాల రోడ్ మైదానంలో ఆదిలాబాద్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ బాలబాలికల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి గస్కంటి గంగాధర్ ప్రకటనలో తెలిపారు. 2006 జనవరి 1లోపు జన్మించిన క్రీడాకారులు అర్హులని పీఈటీ స్నేహ, కోచ్ రవి పేర్కొన్నారు. ఆధార్ జిరాక్స్ పత్రాలతో హాజరుకావాలని సూచించారు. వివరాలకు 77310 44688లో సంప్రదించాలని కోరారు.

ఎల్ఐసీ ఉద్యోగుల నిరసన

ఆదిలాబాద్‌టౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎల్ఐసీ ఉద్యోగులు బుధవారం ఆందోళన చేపట్టారు. సంస్థ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎల్ఐసీ జాయింట్ ఫ్రంట్ కన్వీనర్ దౌలత్‌రావు మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో యాజమాన్యం మొండి వైఖరి ప్రదర్శించడం సరికాదన్నారు. వెంటనే వేతన సవరణ చర్చలు ప్రారంభించాలని, నూతన పెన్షన్ పథకం అమలవుతున్న ఉద్యోగులకు యాజమాన్యం చెల్లించే కాంట్రిబ్యూషన్ 10 నుంచి 14 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. అన్ని క్యాడర్లలో నియామకాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అధికా రుల సంఘం నాయకులు కృష్ణ, శ్యాంరావు, సీనియర్ బ్రాంచ్ మేనేజర్ ఏవీఎస్ సుధాకర్, భాస్కర్, నవీన్ కుమార్, రవికిరణ్, రామకృష్ణ, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద జయంతిని విజయవంతం చేయండి

ఎదులాపురం: ఈనెల 12న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న వివేకానంద జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని యువజన సంఘాల సమితి జిల్లా అధ్యక్షుడు బాలశంకర్ కృష్ణ కోరారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. డైట్ మైదానం ఎదుట గల వివేకానంద చౌక్‌లో ఉదయం 9.30 గంటలకు ఉత్సవాలు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. వేడుకలకు అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలన్నారు. ఇందులో సమితి నాయకులు రాజు, శ్రీకాంత్, సురేష్, గణేష్ వర్మ, రాణాప్రతాప్, అబ్దుల్ అజీజ్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఊయలే.. ఉరితాడై

- ఊపిరాడక బాలిక మృతి
- సరదా తీసిన ప్రాణం



విజయలక్ష్మి (ఫైల్)

ఆదిలాబాద్‌రూరల్: చీరతో ఫ్యాన్‌కు ఊయల కట్టి సరదాగా ఆడుకుంటున్న ఓ చిన్నారికి ఉరి పడి మృతి చెందిన ఘటన ఆదిలాబాద్‌రూరల్ మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని సిరికొండ గ్రామానికి చెందిన కొడప జంగు-లక్ష్మి దంపతులకు కూతురు విజయలక్ష్మి(13), కుమారుడు ఉన్నారు. మంగళవారం ఉదయం తల్లిదండ్రులిద్దరూ చేనుకు పత్తి ఏరేందుకు వెళ్లారు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో విజయలక్ష్మి ఇంట్లో తన మిత్రులతో కలిసి ఫ్యాన్‌కు ఊయలగా చీర కట్టుకుని సరదాగా ఆడుకుంటుంది. ఈ క్రమంలో చీర బాలికకు ఉరిగా బిగుసుకోవడంతో ఊపిరాడక మృతి చెందింది. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు వెంటనే చేరుకున్నారు. వారి రోదనలు మిన్నంటాయి. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కాగా, బాలిక చించుగాడ్ ఆశ్రమ పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది.

బస్టాండ్ వద్ద నిరసన తెలుపుతున్న అద్దె బస్సు డ్రైవర్లు



అద్దె బస్సులు.. రోడ్డెక్కలే

- నిరసన బాటలో ఆర్టీసీ హైర్ బస్సు డ్రైవర్లు
- '104' నిబంధనలు సవరించాలని డిమాండ్
- విధుల బహిష్కరణతో నిలిచిన సేవలు
- ప్రయాణికుల తిప్పలు

ఆదిలాబాద్: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన భారత న్యాయ సంహిత చట్టంలోని హిట్ అండ్ రన్ కేసుల్లో విధించే శిక్షలు కఠినంగా ఉన్నాయంటూ డ్రైవర్లు ఆందోళన బాట పడుతున్నారు. ఇటీవలే ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్లు సమ్మెకు దిగడంతో పెట్రోల్ బంకుల వద్ద జనం బారులు తీరిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ప్రైవేట్ ఆర్టీసీ ప్రైవేట్ హైర్ బస్సు డ్రైవర్లు బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. హిట్ అండ్ రన్ కేసుల్లో ఉన్న 104 నిబంధనలను తొలగించేంతవరకు ఆందోళన కొనసాగిస్తామని పేర్కొన్నారు. సిబ్బంది విధులు బహిష్కరించడంతో అద్దె బస్సులు రోడ్డెక్కలేదు. ముందుగా ఆదిలాబాద్ డిపో మేనేజర్‌కు నిరసన నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా ప్రైవేట్ హైర్ బస్ డ్రైవర్ల అసోసియేషన్ డిపో జనరల్ సెక్రెటరీ సాయికుమార్ మాట్లాడుతూ.. హిట్ అండ్ రన్ కేసుల్లో కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన నిబంధనలు డ్రైవర్లకు గొడ్డలి పెట్టువంటివన్నారు. హిట్ అండ్ రన్ కేసుల్లో జరిమానా రూ.10 లక్షల వరకు పెంచడం, కఠినమైన శిక్షలు విధించడం వలన డ్రైవర్ వృత్తి చేపట్టేందుకు ఎవరు ముందుకు రారన్నారు. తాము చాలీచాలని జీతంతో పని చేస్తూ ఇప్పటికే అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పొరపాటున జరిగే ప్రమాదాలకు భారీ శిక్షలు సబబు కాదన్నారు. అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు భారీ శిక్షలు విధిస్తే తమ కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. శిక్షతో పాటు జరిమానా తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో కేంద్రం దిగివచ్చేంత వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు అబ్దుల్ మజీద్, సాయికృష్ణ తదితరులున్నారు.



మహారాష్ట్ర వైపు వెళ్లే బస్సు ఎక్కే క్రమంలో ప్రయాణికుల తోపులాట ఇలా..

ప్రయాణికులకు తప్పని ఎదురుచూపులు..

ఆర్టీసీ అద్దె బస్సులు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. కేవలం సంస్థ బస్సులు మాత్రమే నడిచాయి. సీట్లు దక్కించుకునేందుకు ప్రయాణికులు పోటీపడ్డారు. తోపులాటలు చేసుకున్నాయి. మహారాష్ట్ర వైపు వెళ్లే బస్సులు పూర్తిగా నిలిచిపోవడంతో ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. ఆదిలాబాద్ బస్టాండ్ రద్దీగా కనిపించింది. సంక్రాంతి సెలవులు సమీపించడంతో ప్రయాణికులు రాకపోకలు పెరిగాయి. ఈ క్రమంలో డ్రైవర్ల నిరసనతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులు ప్రత్యామ్నాయంగా బస్సులు ఏర్పాటు చేస్తే బాగుండేదని అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఆదిలాబాద్, ఉట్నూర్ డిపోలలో మొత్తం 75 అద్దె బస్సులు ఉండగా, అవి నిలిచిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

నిబంధనలు తొలగించే వరకు...



హిట్ అండ్ రన్ కేసుల్లో డ్రైవర్లపై కఠిన శిక్షలు విధిస్తూ చేసిన చట్టంలోని నిబంధనలు వెంటనే తొలగించాలి. లేకుంటే మా కుటుంబాలు రోడ్డున పడే అవకాశం ఉంటుంది. చాలీచాలని జీతంతో ఇప్పటికే ఇబ్బందులు పడుతున్నాం. నిబంధనలు తొలగించే వరకు నిరసన కొనసాగిస్తాం.
– ఎం. రజనీకాంత్, అద్దె బస్సు డ్రైవర్

ఇబ్బందులవుతున్నాయి..



బస్సులు సరిపడా లేక ఇబ్బందులవుతున్నాయి. ఆర్టీసీ అధికారులు ప్రత్యామ్నాయంగా కేటాయిస్తే బాగుండేది. ఇప్పటికే మహాలక్ష్మి పథకం ద్వారా మహిళా ప్రయాణికుల రద్దీ పెరిగి సీట్లు దొరకట్లేదు. ఈ క్రమంలో హైర్ బస్సులు రోడ్డెక్కకపోవడంతో మరిన్ని ఇబ్బందులు పెరిగినై.
– సాయికుమార్, ఆదిలాబాద్

చర్చలు జరుపుతున్నాం..



అద్దె బస్సు డ్రైవర్లు విధులు బహిష్కరించడంతో ఇబ్బందులు ఏర్పడిన మాట వాస్తవమే. అయితే ఈ దిశగా అసోసియేషన్ నాయకులతో చర్చలు జరుపుతున్నాం. వీలైనంత త్వరగా విధుల బహిష్కరణ కార్యక్రమాన్ని విరమించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం.– సోలోమన్,ఆర్టీసీ ఆర్ఎం

కోర్టా-చనాఖాకు నిధులు విడుదల చేయాలి

జైనథ్: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కోర్టా-చనాఖా బ్యారేజీ కోసం నిధులు విడుదల చేయాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఇరిగేషన్ అధికారులతో కలిసి బ్యారేజీ, హట్టిఘాట్ పంప్‌హౌస్ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 2015లో ప్రారంభమైన పనులు 2018 పూర్తి అయి, రైతులకు అందుబాటులోకి రావల్సి ఉండగా ఇప్పటి వరకు పూర్తి కాకపోవడం గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఏళ్ల తరబడి పనులు కొనసాగుతుండటంతో నిర్మాణ వ్యయం పెరిగిందన్నారు. ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో కాలువల కోసం అవసరమైన భూసేకరణ ఇంకా పూర్తి కాలేదన్నారు. ప్రస్తుతం ధరలు పెరగడంతో భూములు ఇచ్చేందుకు రైతులు విముఖత చూపుతున్నారన్నారు. బ్యారేజీ విషయమై అసెంబ్లీ సమావేశాల్లో జరిగిన చర్చ సందర్భంగా సానుకూలంగా స్పందించిన మంత్రులు నిధుల విడుదలకు హామీ ఇచ్చారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం కోర్టా గ్రామంలోని శివాలయంలో ఎమ్మెల్యే పూజలు చేశారు. ఆయన వెంట ఇరిగేషన్ ఈఈ రవీందర్, బీజేపీ జిల్లా నాయకులు లోక ప్రవీణ్‌రెడ్డి, వేదవ్యాస్ తదితరులున్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

మెరుగైన వైద్య సేవలందించాలి

- త్వరలోనే ఉట్నూర్‌లో టి-హబ్
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్
- ఆదిలాబాద్, కుమురంభీం జిల్లాల వైద్యాధికారులతో సమీక్ష

ఉట్నూర్‌రూరల్: గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. ఉట్నూర్‌లోని కేబీ కాంప్లెక్స్ సమావేశ మందిరంలో కలెక్టర్ రాహుల్‌రాజ్, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి ఆదిలాబాద్, కుమురంభీం జిల్లాల వైద్యాధికారులతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. ఆసుపత్రుల్లో అవసరమైన వైద్యులు, సిబ్బందిని నియమించాలని, అవసరమైన సామగ్రి ని సమకూర్చుకోవాలన్నారు. ప్రధానమంత్రి జన జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పీఎం-జన్మన్) కార్యక్రమంలో భాగంగా ప్రతీ పీవీటీజీ కుటుంబానికి ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ పథకాలను అమలు చేయాలన్నారు. ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ.. రిమ్స్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకుచర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం ప్రాంగణంలో అధికారులతో కలిసి మొక్క నాటారు.



మాట్లాడుతున్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్

ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రి సందర్శన

అంతకముందు ఆర్‌వీ కర్ణన్ ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. టి-హబ్ ఏర్పాటు కోసం నిర్మించిన భవనాన్ని పరిశీలించారు. నెల రోజుల్లో పరికరాలు సమకూర్చి వైద్యసేవలు అందుబాటులోకి వచ్చేలా చూస్తామన్నారు. అలాగే ఆసుపత్రిలో ఆయా వార్డుల్లో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఎన్ఆర్‌సీలో చిన్నారులకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. తక్కువ మంది పిల్లలు ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఆన్‌లైన్ నమోదు పరిశీలన

స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా పాలన అభయ హస్తం ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఎలాంటి తప్పులు దొర్లకుండా వివరాలు నమోదు చేయాలని అధికారులు, ఆపరేటర్లకు సూచించారు. వారి వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మోహతో, ఆదిలాబాద్, కుమురంభీం డీఎంహెచ్‌వోలు రాథోడ్ నరేందర్, తుకారాం భట్, వైద్యాధికారులు, పీహెచ్‌వో సందీప్, ఎంపీడీవో తిరుమల తదితరులున్నారు.

ఎస్‌డీఎఫ్ @ 10 కోట్లు

- ప్రతీ నియోజకవర్గానికి అభివృద్ధి పనుల కోసం..
- గైడ్‌లైన్స్‌పై ఉత్కంఠ, ఇన్‌చార్జి మంత్రి ఆమోదంతోనే..
- మంజూరైతే మొదటిసారి కాంగ్రెస్ సర్కార్ నిధులతో వర్క్స్
- ప్రస్తుతం జరుగుతున్నవి పాతవే..



సాక్షి,ఆదిలాబాద్: స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ (ఎస్‌డీఎఫ్) కింద ప్రతీ నియోజకవర్గానికి రూ.10 కోట్లు మంజూరు చేయనున్నట్లు కాంగ్రెస్ సర్కార్ ఇటీవల స్పష్టం చేసింది. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటిసారి అభివృద్ధి పనుల కోసం ఈ నిధులు కేటాయించినట్లు అవుతుంది. ప్రస్తుతం గత ప్రభుత్వ హయాంలో మంజూరైన పనులే కొనసాగుతున్నాయి. ఈ నిధులు కేటాయించనున్నట్లు ప్రకటించినప్పటికీ ఇంకా ఉత్తర్వులు వెలువడలేదు. దీంతో ఎస్‌డీఎఫ్ కింద నిర్వహించే పనులకు సంబంధించి గైడ్‌లైన్స్ ఎలా ఉంటాయనేది అందరు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

ఇన్‌చార్జి మంత్రి ఆధీనంలో..

ఇటీవల ఉమ్మడి జిల్లాల వారీగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రివ్యూ సమావేశాలు నిర్వహిస్తుండగా, ఆదిలాబాద్ జిల్లా సమావేశంలో ఎస్‌డీఎఫ్ కేటాయింపుపై ప్రకటన చేశారు. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి ఈ నిధులు కేటాయించనున్నట్లు వివరించారు. ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆధీనంలో ఈ నిధులు ఉంటాయని తెలి పారు. తద్వారా నియోజకవర్గ ఎమ్మెల్యేలు చేపట్టబోయే పనులకు సంబంధించి ఇన్‌చార్జిమంత్రికి నివేదించాల్సి ఉంటుంది. ప్రధానంగా ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో నలుగురు బీజేపీ ఎమ్మెల్యేలు, ఇద్దరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఒక కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉన్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో ఎస్‌డీఎఫ్ ద్వారా చేపట్టే పనులకు సంబంధించి జిల్లా ఇన్‌చార్జి మంత్రికి ముందుగా ప్రతిపాదనలు చేయాల్సిన అవసరం ఉంది.

గైడ్‌లైన్స్‌పై ఉత్కంఠ..

ఎస్‌డీఎఫ్‌కు సంబంధించి గైడ్‌లైన్స్ ఎలా ఉంటాయనే దానిపై ప్రస్తుతం అధికారులు, ప్రజాప్రతినిధుల్లో ఉత్కంఠ నెలకొంది. సీఎం హామీతో ఈ నిధులు మంజూరవుతాయి. ప్రధానంగా ఎస్‌డీఎఫ్‌తో చేపట్టబోయే పనులకు సంబంధించి ప్రత్యేక విధివిధానాలంటూ ఏమి ఉండవని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత క్రమంలో పనులు చేపట్టడం జరుగుతుందని వివరిస్తున్నారు. బీఆర్ఎస్ సర్కారు మొదటిసారి అధికారంలోకి వచ్చినప్పుడు ఎస్‌డీఎఫ్ ఫండ్ కింద జిల్లాలో బోర్‌వెల్స్ నిర్మాణం కోసం వెచ్చించింది. నీటి సమస్య నివారణకు ప్రాధాన్యతనిస్తూ ఈ పనులు చేపట్టారు. అప్పుడు నియోజకవర్గానికి రూ.50 కోట్ల చొప్పున కేటాయించినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఆ తర్వాత 2018–19లో ఒక్క ఆదిలాబాద్ నియోజకవర్గానికి రూ.210 కోట్లు ఎస్‌డీఎఫ్ కింద అప్పట్లో కేటాయించారు. ఆ నిధులతో 2500 పనులు చేపడుతుండగా, ఇప్పటివరకు సుమారు రూ.160 కోట్లకు పైగా పూర్తికాగా, మిగతావి పురోగతిలో ఉన్నాయి. బోథ్ నియోజకవర్గంలో అప్పట్లో రూ.50 కోట్లు ఏడు రోడ్ల నిర్మాణాలకు మంజూరు కాగా, వాటి పరిస్థితి కూడా కొన్ని పురోగతిలో ఉండగా, మరికొన్ని పూర్తయ్యాయి.

విధివిధానాలు వస్తేనే స్పష్టత..

ఎస్‌డీఎఫ్‌కు సంబంధించి ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి గైడ్‌లైన్స్ రాలేదు. విధివిధానాలు వస్తేనే ప్రభుత్వం తీసుకునే ప్రాధాన్యత పనులపై స్పష్టత వచ్చే అవకాశం ఉంటుంది.
– వెంకటరమణ, ముఖ్యప్రణాళిక అధికారి, ఆదిలాబాద్

ముమ్మరంగా 'ఆన్‌లైన్'

- ప్రజాపాలన దరఖాస్తుల నమోదు ప్రక్రియ వేగవంతం
- జిల్లాలో 44శాతం పూర్తి
- గడువులోపు పూర్తిచేసేలా కార్యాచరణ

కైలాస్‌నగర్: అభయహస్తం ఆరు గ్యారంటీల దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ జిల్లాలో ముమ్మరంగా సాగుతోంది. ప్రజాపాలనలో భాగంగా గతేడాది డిసెంబర్ 28 నుంచి ఈ ఏడాది జనవరి 6వరకు అర్హులైన వారి నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. ఎనిమిది రోజుల్లో 2,25,205 అప్లికేషన్లు అందాయి. వాటికి సంబంధించిన సమగ్ర సమాచారం ప్రజాపాలన అధికారిక వెబ్‌సైట్‌లో నమోదు చేసేందుకు జిల్లా వ్యాప్తంగా 634 మంది కంప్యూటర్ ఆపరేటర్లను నియమించారు. 17 మండలాల్లోని గ్రామీణప్రాంతాల దరఖాస్తులను ఆయా ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలతో పాటు జిల్లా కేంద్రంలోని ఇతరశాఖల కార్యాలయాల్లో నమోదు చేయిస్తున్నారు. ఆదిలాబాద్ మున్సిపల్‌కు సంబంధించి పట్టణ శివారులోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో 120మంది ఆపరేటర్లతో నమోదు ప్రక్రియ కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువుకు ముందుగానే పూర్తిచేసేలా అధికారులు పకడ్బందీ కార్యాచరణతో ముందుకు సాగుతున్నారు.

99,588 దరఖాస్తుల నమోదు పూర్తి

అర్హుల నుంచి స్వీకరించిన దరఖాస్తులకు సంబంధించిన వివరాలను నాలుగు రోజులుగా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 2,25,205 దరఖాస్తులుఅందగా మంగళవారం వరకు 99,588 అప్లికేషన్ల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పూర్తయింది. అత్యధికంగా మావల మండలంలో 77శాతం నమోదు పూర్తిచేశారు.1809దరఖాస్తులు అందగా 1,387 అప్లికేషన్లను ఆన్‌లైన్ చేశారు. అలాగే నేరడిగొండలో 65 శాతం పూర్తయింది. ఈ మండలంలో 8,475 దరఖాస్తులు అందగా ఇప్పటి వరకు 5,486 అప్లికేషన్లను వెబ్‌సైట్‌లో నమోదు చేశారు. భీంపూర్ మండలంలో కేవలం 33శాతం పూర్తి చేశారు. ఈ మండలంలో మొత్తం 8,055 దరఖాస్తులు రాగా ఇప్పటి వరకు కేవలం 2,631 దరఖాస్తుల సమాచారం మాత్రమే ఎంట్రీ చేశారు. మిగతా మండలాల్లో ప్రక్రియ వేగంగానే సాగుతోంది. సుమారు 40 నుంచి 57 శాతం వరకు పూర్తయింది. ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో 35శాతం మాత్ర మే దరఖాస్తుల నమోదు జరిగినట్లుగా అధికారులు తెలిపారు. మున్సిపల్ పరిధిలో 48,655 దరఖాస్తులు అందితే ఇప్పటి వరకు 16,828 దరఖాస్తుల సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేశారు. ఈ నెల 30వరకు ఆన్‌లైన్‌లో వందశాతం నమోదు చేసేందుకు ప్రభుత్వం గడువు ప్రకటించగా జిల్లాలో ఈ ప్రక్రియ వేగంగా సాగుతోంది. బుధవారం వరకు నమోదైన నమోదు సమాచారంపై జెడ్పీ డిప్యూటీ సీఈవో రాథోడ్ రాజేశ్వర్‌ను సంప్రదించగా గడువు కంటే ముందుగానే ప్రక్రియ పూర్తి చేస్తామని పేర్కొన్నారు.



పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో దరఖాస్తుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న ఆపరేటర్లు

బాలల హక్కులు పరిరక్షించాలి

- ఐసీపీఎస్ ప్రోగ్రాం మేనేజర్ డేవిడ్

కైలాస్‌నగర్: ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో సాగినప్పుడే బాలల హక్కుల పరిరక్షణ సాధ్యపడుతుందని ఐసీపీఎస్ రాష్ట్ర ప్రోగ్రాం మేనేజర్ డేవిడ్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ముహిత ఆర్గనైజేషన్, జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా బాలల రక్షణ ప్రణాళికపై బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రమాదకర ప్రదేశాల్లో బాలలు పనిచేసినట్లైతే వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్, పోలీసులకు సమాచారం అందించాలన్నారు. బాలల హక్కుల సంరక్షణ కోసం సీడబ్ల్యూసీ ఎంతో తోడ్పడుతుందని తెలిపారు. అంతకు ముందు బాలల హక్కుల పరిరక్షణలో వివిధ శాఖల ప్రాధాన్యతను ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఇందులో జిల్లా సంక్షేమాధికారి మిల్కా, ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్, మైనార్టీ సంక్షేమాధికారి రమేశ్‌రాథోడ్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ రాజేశ్వర్, సఖీ కేంద్ర కోఆర్డినేటర్ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐసీపీఎస్ ప్రోగ్రాం మేనేజర్ డేవిడ్

క్లుప్తంగా

లక్ష్మణచాంద తొలి మహిళ మాజీ సర్పంచ్ మృతి


సాయవ్వ (ఫైల్)

లక్ష్మణచాంద: లక్ష్మణచాంద తొలి మహిళ మాజీ సర్పంచ్ శెవ్వ సాయవ్వ(68) అనారోగ్యంతో మృతి చెందింది. మూడు సంవత్సరాల నుంచి అనారోగ్యంతో బాధపడుతోంది. బుధవారం ఉదయం పరిస్థితి విషమించి మృతి చెందారు. దీంతో ఆమె మృతి చెందిన విషయం తెలుసుకున్న గ్రామస్తులు తరలివచ్చి నివాళులర్పించారు. సర్పంచ్‌గా గ్రామానికి చేసిన సేవలు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

జిన్నింగ్ మిల్లులకు భారీగా పత్తి


రోడ్డుపై క్యూలైన్‌లో పత్తి వాహనాలు

బోథ్: బోథ్ మార్కెట్ పరిధిలోని పలు జిన్నింగ్ మిల్లులకు బుధవారం రైతులు పత్తిని భారీగా తీసుకువచ్చారు. గత మూడు రోజులు సెలవులు ఉండడంతో బుధవారం జిన్నింగ్ మిల్లులకు రైతులు పెద్ద ఎత్తున పత్తిని తీసుకొచ్చారు. దీంతో బోథ్ ప్రధాన రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. సొనాల, నేరడిగొండ మండలాల్లో పత్తి నిల్వలు ఎక్కువగా ఉండటంతో సీసీఐ కొనుగోళ్లను రెండు రోజుల పాటు నిలిపివేసింది. ఈ మేరకు ఆయా మండలాల్లోని రైతులు పత్తిని బోథ్‌కు తీసుకువచ్చారు.

గుడుంబా స్థావరాలపై దాడులు


దాడులు నిర్వహిస్తున్న అధికారులు

కడెం: మండలంలోని పెద్దూర్‌తండా, నర్సాపూర్, పాండ్వపూర్, అంబారిపేట్ గ్రామాల్లో బుధవారం ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్, నిఘా విభాగం అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పది లీటర్ల గుడుంబా, 1500 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ సంపత్‌కృష్ణ తెలిపారు. ఇందులో ట్రాస్క్‌ఫోర్స్ సీఐ రంగస్వామి, గంగారెడ్డి, ఎక్సైజ్ ఎస్సై జె.రమేశ్ ఉన్నారు.

పింఛన్ కష్టాలు..


క్యూలైన్‌లో మహిళలు, వృద్ధులు

దిలావర్‌పూర్: మండల కేంద్రంలోని స్థానిక పోస్టాఫీస్ వద్ద ప్రతినెలా పింఛన్ల కోసం లబ్ధిదారులు పడే కష్టాలు వర్ణనాతీతం. పెన్షన్ వచ్చిందంటే చాలు అక్కడకు వచ్చే వృద్ధులు, మహిళలు నానా ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం ఉదయం స్థానిక పోస్టాఫీసు వద్ద జనం గుమ్మిగూడడంతో వారందరినీ క్యూలైన్‌లలో రావాలని చెప్పారు. సరైన సిబ్బంది లేకపోవడంతో పెన్షన్ దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇకనైనా సిబ్బందిని పెంచి సకాలంలో పింఛన్లు ఇబ్బందులు లేకుండా అందించాలని వేడుకుంటున్నారు.

దీక్ష భూమికి.. కొత్తశోభ


శ్రీసంత్ రామారావు మహరాజ్ విగ్రహం


దీక్ష భూమి వద్ద ముస్తాబైన జగదాంబదేవి ఆలయం

- నేడు గురు కృప దినోత్సవం...
- బోగ్‌బండారో, మహాపూజకు ఏర్పాట్లు పూర్తి
- నిర్వహించనున్న శ్రీసంత్ సద్గురు ప్రేంసింగ్ మహరాజ్
- ముస్తాబైన జాతీయ బంజారా దీక్ష భూమి

నార్నూర్: మండలంలోని కొత్తపల్లి–హెచ్ గ్రామంలోని జాతీయ బంజారాల దీక్ష భూమి వద్ద ఆధ్యాత్మిక శోభ నెలకొంది. దీక్ష భూమి వద్ద కొలువుదీరిన జగదాంబదేవి, రాష్ట్రీయ సంత్ మహాన్ తపస్వీ, ధర్మగురువు రామారావ్ మహారాజ్ మందిరాలను ముస్తాబు చేశారు. దీక్ష గురువు శ్రీసంత్ ప్రేంసింగ్ మహరాజ్ అధ్యక్షతన ప్రతి యేటా జనవరి 11న నిర్వహించే గురుకృప దినోత్సవం (దీక్ష దివస్) కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తిచేశారు. జాతీయ బంజారాల దీక్ష భూమి వద్ద గురువారం ఉదయం లంబాడీల కులదైవమైన జగదాంబదేవి, రాష్ట్రీయ సంత్ మహాన్ తపస్వీ, ధర్మ గురువు శ్రీరామారావ్ మహరాజ్‌లు సోమవారం ఉదయం 11గంటలకు ప్రత్యేక పూజ, బోగ్ బండారో నిర్వహిస్తారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు.

సామాజిక అంశాలపై అవగాహన..

కుమురంభీం జిల్లా కెరమెరి మండలంలోని శంకర్‌లొద్ది వద్ద 1979 దీక్ష గురువు శ్రీసద్గురు ప్రేంసింగ్ మహరాజ్ తపస్సు చేశారు. జనవరి 11, 1979లో మహారాష్ట్రలోని పొరదేవి నుంచి ధర్మ గురువు రాష్ట్రీయ సంత్ మహాన్ తపస్వీ రామారావ్ మహారాజ్ శంకర్‌లొద్ది చేరుకుని దీక్ష చేస్తున్న ప్రేంసింగ్ మహరాజ్‌ను ఎందుకు దీక్ష చేస్తున్నావని అడిగి శిష్యుడిగా స్వీకరించాడు. 1988లో శంకర్‌లొద్ది గ్రామంలో శివయజ్ఞం, 1992లో కొత్తపల్లి–హెచ్ దీక్ష భూమి వద్ద లక్ష్య చండీయజ్ఞాన్ని నిర్వహించారు. అప్పటి నుంచి ప్రతీ ఏడాది కొత్తపల్లి–హెచ్‌లోని జాతీయ బంజారాల దీక్ష భూమి వద్ద గురుకృప దినోత్సవం (దీక్ష దివస్) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు.


ఏర్పాట్లు పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ జనార్దన్

ఆధ్యాత్మికతతోనే మేలు..



ప్రతీ ఏడాది జనవరిలో గురుశిష్యుల మిలన్ కార్యక్రమం నిర్వహిస్తాం. ఆధ్యాత్మికతతోనే సమాజం జాగృతం అవుతుంది. యువతకు సంస్కృతి, సంప్రదాయాలను వివరిస్తున్నాం. శాంతి, అహింసతో ఏదైన సాధ్యమే. వేల సంఖ్యలో వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– శ్రీ సంత్ సద్గురు ప్రేంసింగ్ మహరాజ్, దీక్ష గురువు

సంప్రదాయాలకు అనుగుణంగా



జాతీయ బంజారా దీక్ష భూమి వద్ద నిర్వహించే గురుకృప దినోత్సవం లంబాడా గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా ఉండాలి. ప్రతీ తండా నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలిరావాలి. అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగింది. భావితరాలకు ఆదర్శంగా ఉండేలా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం.

– రాథోడ్ జనార్దన్, జెడ్పీ చైర్మన్ ఆదిలాబాద్

పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నాం.



గురుకృప దినోత్సవం నిర్వహణకు దీక్ష భూమి వద్ద అన్ని రకాల ఏర్పాట్లు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తాం. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నాం. ఉదయం 11గంటలకు బోగ్ బండారో, మహాపూజ అనంతరం దర్బార్ ఉంటుంది. భక్తులు విజయవంతం చేయాలి.

– జాదవ్ రెడ్డినాయక్, కమిటీ అధ్యక్షుడు

చిరుతపులి కలకలం..!

- భయాందోళనలో రైతులు


పాదముద్రలు సేకరిస్తున్న ఎఫ్‌బీవో హరిలత

కుంటాల: నిర్మల్ జిల్లా కుంటాల మండలంలోని పెంచికల్‌పాడ్ గ్రామ శివారులో బుధవారం చిరుతపులి సంచారం కలకలం రేపింది. రైతు పుంద్రు గంగారెడ్డి, పాలేరు సందీప్, తోటి పాలేరు విజయ్‌లతో కలిసి వ్యవసాయ పనులకు వెళ్లారు. వారు పనిలో నిమగ్నమై ఉండగా చిరుతపులి కనిపించడంతో పరుగులు పెట్టారు. రైతు నారాయణరెడ్డి పొలం వైపు వెళ్తుండగా గమనించిన వారు విషయాన్ని గ్రామస్తులకు చెప్పారు. గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎఫ్‌బీవో హరిలత నమూనాలు సేకరించి చిరుత పులి పాదముద్రలుగా నిర్ధారించారు. ఆమె వెంట సిబ్బంది అలాంఖాన్ ఉన్నారు. దీంతో రైతులు పంట చేనులకు వెళ్లేందుకు జంకుతున్నారు. అలాగే ఎఫ్ఆర్వో రాథోడ్ రమేష్, ఎఫ్ఎస్‌వో శ్రీనివాస్, ఎఫ్‌బీవో స్రవంతి సైతం ఘటనా స్థలాన్ని పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని వివరించారు.

- కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి...
- మిగిలిన పోడు భూములన్నింటికీ పట్టాలు అందించాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్ వెస్లీ

ఎదులాపురం: ప్రజా సమస్యల పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్ వేస్లీ అన్నారు. జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో బుధవారం నిర్వహించిన పార్టీ జిల్లా ప్లీనరి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలైన ఆరు గ్యారెంటీలను కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ దోపిడీ విధానాలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కార్మికులు, కర్షకుల హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు. దళితులపై దాడులు జరుగుతున్నాయని, ఏడాదికి వెయ్యి మంది హత్యకు గురవుతున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వం 13 లక్షల ఎకరాల పోడు భూములకు గాను కేవలం 3 లక్షల ఎకరాలకు పట్టాలు పంపిణీ చేసిందని గుర్తుచేశారు. మిగిలిన వాటికి పట్టాలు అందించాలని సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. అనంతరం జిల్లా అభివృద్ధి, సమస్యల పరిష్కారం దిశగా పలు తీర్మానాలు చేశారు. సీసీఐ పరిశ్రమను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా ఇన్‌చార్జి బండారు రవికుమార్, జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, పార్టీ కార్యదర్శివర్గ సభ్యుడు లంకా రాఘవులు, సీనియర్ నాయకుడు బండి దత్తాత్రి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అన్నమొల్ల కిరణ్, పూసం సచిన్, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, మంజుల, సురేందర్ ఉన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం


జెండా ఎగురవేస్తున్న సీపీఎం నాయకులు


మాట్లాడుతున్న కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ

ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి

- తుడుందెబ్బ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గోడం గణేశ్


నినాదాలు చేస్తున్న ఆదివాసీలు

ఆదిలాబాద్‌రూరల్: లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే వరకూ ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గోడం గణేష్ అన్నారు. బుధవారం మావల మండలంలోని బట్టిసావర్‌గాం శివారు ప్రాంతంలోని కుమురంభీం గూడలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆదిలాబాద్‌అర్బన్, మావల మండల కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టబద్దత లేని లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే వరకూ ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 342కు విరుద్ధంగా చట్ట సభలో ఆమోదం లేని లంబాడాలతో తెలంగాణ రాష్ట్ర రిజర్వేషన్‌లో ఆదివాసీలకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము చేస్తున్న పోరాటంలో ప్రజా, రాజకీయ, న్యాయపోరాటంలో అందరిని కలుపుకుని శాస్త్రీయ పద్ధతిలో ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. ఆదివాసీ గూడాలలో కనీస మౌలిక వసతులైన తాగునీరు, రోడ్డు, వైద్యం వంటి సౌకర్యాలు కల్పించేందుకు జిల్లా ఉన్నత అధికారులు, స్థానిక ఎమ్మెల్యేలు చొరవ తీసుకోవాలన్నారు. అనంతరం తుడుం దెబ్బ ఆదిలాబాద్ పట్టణ, మావల మండల కమిటీలకు ఎన్నికలు నిర్వహించి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా మడావి దిగంబర్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా అనక గంగారాం, మావల మండల అధ్యక్షుడిగా వెడ్మ ముకుంద్, ప్రధాన కార్యదర్శిగా పంద్రం గంభీర్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ రాష్ట్ర ప్రచార కార్యదర్శి కొడప నగేష్, రాష్ట్ర సహాయ కార్యదర్శి కుమ్ర శ్యామ్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, నాయకులు సలాం వరుణ్, సోయం లలిత, మర్సుకోల భరత్, ఆత్రం గణపతి పాల్గొన్నారు.

శనగపంటను ఆశిస్తున్న పచ్చ, లద్దె పురుగు


పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి

నేరడిగొండ: యాసంగిలో సాగవుతున్న శనగ పంటను పచ్చ, లద్దె పురుగులు ఆశిస్తున్నాయని జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య అన్నారు. బుధవారం మండలంలోని సావర్గం గ్రామంలోని శనగ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో రైతులు శనగ పంటను అత్యధికంగా పండిస్తున్నారని తెలిపారు. శనగలో కొన్నిచోట్ల శనగ పచ్చ పురుగుతో పాటు లద్దె పురుగు సోకిందని తెలిపారు. వీటి నివారణకు నోవల్యూరాన్ లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ మందులను పిచికారీ చేయాలని సూచించారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని పేర్కొన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి బిర్రు భాస్కర్, ఏఈవో జైపాల్, రైతులు నారాయణ, గంగయ్య ఉన్నారు.

ప్రజాప్రతినిధుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

కుంటాల: సాధారణంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించుకోవడం సహజమే. కానీ మండలంలోని విఠాపూర్ గ్రామంలో సర్పంచ్ గల్లపురం లక్ష్మి రమేష్ ఆధ్వర్యంలో తాజా మాజీ సర్పంచ్, వార్డు సభ్యుల ఆత్మీయ సమ్మేళనాన్ని బుధవారం నిర్వహించారు. మండలంలోని విఠాపూర్, వెంకూర్ గ్రామపంచాయతీలో 1994 నుంచి 2024 వరకు ఉన్న పాలకవర్గ సభ్యులు అందరూ హాజరయ్యారు. ప్రజలకు చేసిన సేవ, అభివృద్ధిపై చర్చించి రోజంతా సరదాగా గడిపారు. అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో తాజా, మాజీ సర్పంచ్‌లు గల్లాపురం లక్ష్మిరమేష్, విఠల్‌రావు పటేల్, ఉమ్రి లక్ష్మణ్, సరోజా సాయన్న, మగ్గిడి శృతి, మగ్గిడి దిగంబర్, కారోబారి లక్ష్మణ్ పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

నేరడిగొండ: మండలంలోని కుప్టి జాతీయ రహదారి వద్ద బుధవారం సాయంత్రం బైక్ అదుపు తప్పి ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. బోథ్ మండలం ఇస్కర్‌పల్లి గ్రామానికి చెందిన ఆడెం రవిందర్, కడెం మండలం శంభుగూడ గ్రామానికి చెందిన మెస్రం అనిల్ కుమార్‌లు ద్విచక్ర వాహనంపై ఇచ్చోడ వైపు నుంచి బోథ్‌కు వెళ్తుండగా కుప్టి జాతీయ రహదారిపై బైక్ అదుపు తప్పి కిందపడడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు.


గాయాలపాలైన యువకుడు

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తికి రిమాండ్

లక్ష్మణచాంద: పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తికి 14రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఈ నెల 7న మండలంలోని మల్లాపూర్ గ్రామంలో గొడవ జరుగుతుందని 100 డయల్ ద్వారా సమాచారం రాగా లక్ష్మణచాంద పోలీస్‌స్టేషన్‌కి చెందిన పోలీస్ సిబ్బంది కానిస్టేబుల్ అశోక్, దిలీప్‌లు మల్లాపూర్ గ్రామానికి వెళ్లారు. గొడవకు కారణమైన అదే గ్రామానికి చెందిన తలారి గణేష్ అనే వ్యక్తి పోలీస్‌వారితో దుర్భాషలాడుతూ వారి విధులకు ఆటంకపరచగా ఎస్సై శ్రీకాంత్ అతడిపై కేసు నమోదు చేశాడు. బుధవారం అతడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా 14రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై పేర్కొన్నాడు.

సదర్మాట్ ఆయకట్టుకు నీరందిస్తాం

- మంత్రి సీతక్క


ఎమ్మెల్యే, కలెక్టర్‌తో మాట్లాడుతున్న మంత్రి

ఖానాపూర్: ఖానాపూర్, కడెం మండలాల రైతులకు సాగునీరు అందించే సదర్మాట్ ద్వారా రైతుల రెండు పంటలకు సరిపడా సాగునీటిని అందిస్తామని మంత్రి సీతక్క అన్నారు. బుధవారం మండలంలోని మేడంపల్లి గ్రామంలోని సదర్మాట్‌ను ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో పాటు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి మంత్రి సందర్శించారు. ఆయకట్టు పరిధిలోని 13వేల ఎకరాలకు నీటిని అందించాలని, ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌తో పాటు ఇరిగేషన్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లి నీరు అందేలా కృషి చేస్తామన్నారు.

సమాంతర అభివృద్ధికి కృషి..

ఉమ్మడి జిల్లా వెనకబడిన ప్రాంతం కావడంతో పేదలు ఎక్కువగా ఉన్నారని మంత్రి అన్నారు. ఈ ప్రాంతంపై దృష్టిపెడుతూనే మిగతా ప్రాంతాలతో సమాంతరంగా అభివృద్ధి చేసేందుకు సీఎంతో పాటు ప్రభుత్వం పూర్తిస్థాయిలో కృషి చేస్తుందన్నారు. త్వరలో ఐదు జిల్లాల ఇరిగేషన్ అధికారులు, కలెక్టర్‌లు, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించి ఎక్కడెక్కడ పనులు చేస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందో చర్చించి చర్యలు చేపడుతామన్నారు. అంతకుముందు పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ ఇంటికి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో కలిసి వెళ్లి తేనీటి విందును స్వీకరించారు. సీపీఐఎంఎల్ ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి నందిరామయ్య సదర్మాట్ సమస్యపై మంత్రికి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఐసీడీఎస్ సీడీపీవో సరిత ఆధ్వర్యంలో సూపర్‌వైజర్లు మంత్రిని కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. నాయకులు శ్రీహరిరావు, చిన్నం సత్యం, జంగిలి శంకర్, యూసుఫ్‌ఖాన్, పుప్పాల శంకర్, నిమ్మల రమేష్, అబ్దుల్ మాజిద్, షబ్బీర్‌పాషా, సలీంఖాన్, శ్రీనివాస్, ఆసీఫ్, కమలాకర్, భూమేశ్ ఉన్నారు.

సీతక్కకు వినతుల వెల్లువ


వినతిపత్రం ఇస్తున్న ఉద్యమకారుల ఫోరం నాయకులు

నిర్మల్‌ఖిల్లా/నిర్మల్‌రూరల్: అధికారంలోకి రాగానే సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమల్లోకి తెస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని కోరుతూ జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్రమంత్రి సీతక్కకు సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు వినతిపత్రం జేశారు. ఇందులో ఏఈవోల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండపల్లి అశోక్ కుమార్, చక్కెర శ్రీనివాస్, నరేష్, రాకేష్ పాల్గొన్నారు.

అమరుల కుటుంబాలను ఆదుకోవాలి

నిర్మల్‌టౌన్/భైంసాటౌన్: తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న అమరుల కుటుంబాలను ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా నాయకులు డాక్టర్ ముష్కం రామకృష్ణగౌడ్ మంత్రి సీతక్కకు విన్నవించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చైర్మన్ కొట్టే శేఖర్, నిర్మల్ జిల్లా నాయకులు చాకేటి లస్మన్న, సామ కిరణ్‌కుమార్ రెడ్డి ఉన్నారు.

కుభీర్: మండలంలోని విద్యావలంటీర్లు మంత్రికి వినతిపత్రం అందించారు. ఇందులో ఆ సంఘం అధ్యక్షుడు లవకుశ్ మంత్రి విచారణ చేసి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ జిల్లా పెన్షనర్ల సంఘం నాయకులు సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు లింగన్న, ప్రధాన కార్యదర్శి హనుమంత్‌రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్, యూనిట్ కార్యదర్శి జనార్దన్, యూనిట్ కోశాధికారి రమేష్ ఉన్నారు.

దిలావర్‌పూర్: తమ గ్రామ పరిసరాల్లో ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణంతో భూములను వదిలివేయాల్సిన పరిస్థితి ఉందంటూ గుండంపల్లి గ్రామ రైతులు మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లారు. ఫ్యాక్టరీని తరలించి తమకు న్యాయం చేయాలని కోరారు.

మద్యం పట్టివేత

కుంటాల: మండలంలోని పెంచికల్‌పాడ్‌లో బుధవారం పక్కా సమాచారం మేరకు గాజుల సాయి ఇంట్లో బుధవారం దాడి చేసి అక్రమంగా నిల్వచేసిన మద్యం పట్టుకున్నట్లు ఎస్సై హన్మండ్లు తెలిపారు. దాని విలువ రూ.5,585 ఉంటుందని, కేసు నమోదు చేసినట్లు చేసినట్లు ఎస్సై చెప్పారు.

అభిమానాన్ని మెచ్చి.. చెప్పులు ధరింపజేసి


చెప్పులు ధరించిన యువ నాయకుడు కపిల్

తాంసి: భీంపూర్ మండలంలోని అంతర్గాం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యువ నాయకుడు బక్కి కపిల్‌యాదవ్ బుధవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సమక్షంలో చెప్పులు ధరించాడు. పార్టీ బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌పై తనకున్న అభిమానంతో అనిల్ జాదవ్ ఎమ్మెల్యేగా గెలువాలని కోరుతూ ఎన్నికల్లో చెప్పులు ధరించకుండా పార్టీ తరఫున ప్రచారం నిర్వహించాడు. అనిల్ జాదవ్ ఎమ్మెల్యేగా గెలిచి ప్రమాణ స్వీకారం చేసిన తరువాత చెప్పులు ధరిస్తానని తన ఇష్ట దైవాన్ని సైతం వేడుకున్నాడు. బోథ్ ఎమ్మెల్యేగా అనిల్ జాదవ్ భారీ మెజార్టీతో గెలుపొందడంతో బుధవారం భీంపూర్ మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే స్వయంగా తీసుకొచ్చిన చెప్పులను పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో యువ నాయకుడు బక్కి కపిల్ ధరించాడు. తనపై ఉన్న అభిమానంతో ప్రచారం చేసినందుకు కపిల్‌ను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించాడు.

సీసీఐ తెరిచాకే ఓట్లు అడగాలి

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవి కుమార్


నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ఎదులాపురం: జిల్లా కేంద్రంలోని సీసీఐ (సిమెంట్ ఫ్యాక్టరీ) పునఃప్రారంభించాకే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఓట్లు అభ్యర్థించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవి కుమార్ అన్నారు. సీసీఐని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో బీజేపీ ఎమ్మెల్యేను గెలిపిస్తే సీసీఐని ప్రారంభిస్తామని అమిత్‌షా హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. పునరుద్ధరణకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని, మళ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు అడగడానికి రావడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే, ఎంపీ స్థానాల్లోనూ బీజేపీ పార్టీయే విజయం సాధించిందని తెలిపారు. ఈ నేపథ్యంలో సీసీఐ పరిశ్రమ పునరుద్ధరణ, ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ రైల్వే లైన్, జిల్లా కేంద్రంలో విమానాశ్రయం ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి కలిసి వచ్చే పార్టీలు, ప్రజా సంఘాలతో సీపీఎం భవిష్యత్తులో పోరాటాలు నిర్వహిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి మల్లేష్, జిల్లా నాయకులు లంకా రాఘవులు, బండి దత్తాత్రి, పూసం సచిన్, కిరణ్ ఆశన్న, సురేందర్ గంగన్న, మంజుల పాల్గొన్నారు.

ఇద్దరు మట్కా నిర్వాహకుల అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: ఇద్దరు మట్కా నిర్వాహకులను సీసీఎస్ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. పట్టణంలోని ఖుర్షీద్‌నగర్‌లో మట్కా నిర్వహిస్తుండగా షేక్‌అహ్మద్, మసూద్ ఖాన్‌లను పట్టుకున్నారు. వీరి నుంచి మట్కా చీటీలతో పాటు రూ.5,950, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. టూటౌన్‌లో కేసు నమోదు చేశారు. మట్కా నిర్వహిస్తే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.